సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 21 । జూలై । 2024



రెగ్యులైజేషన్ ఎప్పుడో?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఒప్పంద గడువు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో ▸



ఆస్తి కోసం తండ్రి హత్య

ఆస్తి తన పేరున రాయలేదనే కక్షతో మద్యం మత్తులో కన్నతండ్రిపై దాడి చేసి హతమార్చాడు కొడుకు. కామవరపుకోట మండలం తడికలపూడిలో ఈ ఘటన జరిగింది. 8లో ▸



శ్రీవారి క్షేత్రంపై వర్షం ప్రభావం

వర్షం కారణంగా చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా తగ్గింది. శనివారం వర్షం కారణంగా ఆలయానికి భక్తులు నామమాత్రంగా విచ్చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్ బదిలీ



సీవీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను ఏపీ మారిటైమ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతానికి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా ఎవరినీ కేటాయించలేదు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, ఫైర్, తదితర శాఖలు నిరంతరం వరద పరిస్థితులను పర్యవేక్షించాలాన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పంట పొలాలు ముంపుకు గురి కాకుండా సాగునీటి కాలువలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సౌకర్యం తక్షణ పునరుద్ధరణకు సిబ్బంది, విడి పరికరాలు సిద్ధం చేయాలని సూచించారు. బ్లీచింగ్, క్లోరినేషన్ నిల్వలు సిద్ధంగా ఉంచాలని, తాగునీటిని ఇంజినీరింగ్ సహాయకులు ద్వారా టెస్టింగ్ చేయాలని ఆదేశించారు. విపత్తులు సంభవించే అవకాశాలు ఉన్న ప్రదేశాలు గుర్తించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో కాలువలు, పంట పరిస్థితి ఎలా ఉందో పర్యవేక్షించాలన్నారు. అవసరమైన రేషన్ సరుకులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించే విధంగా అవసరమైన రంపాలు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.


26న కేజీఆర్ఎల్‌లో జాబ్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భీమవరం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న సూర్యమిత్ర ఎగ్జిమ్‌లోని వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి శనివారం చెప్పారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సూర్యమిత్ర కంపెనీలో సీనియర్ ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్స్, హెచ్ ఆర్ అసిస్టెంట్, కోల్డ్ స్టోరేజ్ సూపర్‌వైజర్స్, క్వాలిటీ కంట్రోల్ వంటి వివిధ ఉద్యోగావకాశాలున్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 95020 24765, 70138 96277 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

జిల్లాలో సరాసరి 34.2 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లాలో మూడురోజులుగా ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం ఉదయం 8.30 గంటల వరకూ జిల్లాలోని 20 మండలాల్లో సరాసరి 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా పాలకొల్లులో 51.4 మిల్లీమీటర్లు, తాడేపల్లిగూడెంలో 49.4, పెంటపాడులో 48.2, ఇరగవరంలో 44, తణుకులో 29, అత్తిలిలో 25.2, గణపవరంలో 32.4, ఆకివీడులో 32, ఉండిలో 36.6, పాలకోడేరులో 32.4, పెనుమంట్రలో 35.8,పెనుగొండలో 35.4, ఆచంటలో 32, పోడూరులో 33.2, వీరవాసరంలో 20.8, భీమవరంలో 30.2, కాళ్లలో 27.2, మొగల్తూరులో 30.4, నరసాపురంలో 28.6, యలమంచిలిలో 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పీహెచ్‌సీ తనిఖీ



పెంటపాడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

పెంటపాడు: పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న పలు కార్యక్రమాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్లు తోట రాజేష్, వి.మోనికను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి క్లోరినైజేషన్‌పై నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

- ఎర్రకాలువ మహోగ్రరూపం.. నీటమునిగిన గ్రామాలు
- దువ్వ వీధుల్లోకి వయ్యేరు వరద నీరు
- భీమవరం పట్టణానికి యనమదుర్రు ముంపు ముప్పు
- ఉండి మండలాన్ని వణికిస్తున్న యనమదుర్రు, పంట కాలువలు
- **ప్రమాదకరంగా గొంతేరు, నక్కలకాలువ, కాజ, భగ్గేశ్వరం, మొగల్తూరు డ్రెయిన్లు**

ముంచెత్తిన వరద



తాడేపల్లిగూడెం మండలం మాధవరం - కంసాలిపాలెం కాజ్ వే మార్గంలో పంటపొలాలను ముంచుతూ ప్రవహిస్తున్న ఎర్రకాలువ

భీమవరం/తాడేపల్లిగూడెం రూరల్/తణుకు టౌన్/ఉండి: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు జిల్లాలోని మేజర్ డ్రెయిన్లు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందోనని పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంట నీట మునగగా.. వరద ఊళ్లను ముంచెత్తే ప్రమాదం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యాయి. ప్రధానంగా యనమదుర్రు, గొంతేరు, నక్కలకాలువ, బసవరాజు కోడు, వెంకయ్య వయ్యేరు, కాజ, భగ్గేశ్వరం, మొగల్తూరు డ్రెయిన్లు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ మహోగ్రరూపం దాల్చి గ్రామాల్ని ముంచెత్తింది. వందల ఎకరాల్లో పంట నీటమునగగా ఊళ్లలోకి వరద నీరు ప్రవేశించింది. ఎగువ ప్రాంతం నుంచి క్షణక్షణానికి ప్రవాహం పెరుగుతుండడంతో నీటి మట్టం మరింత పెరిగే ముప్పు ఉందని భయపడుతున్నారు.

భీమవరం పట్టణానికి వరద ముంపు

యనమదుర్రు డ్రెయిన్ పొంగితే భీమవరం పట్టణానికి ముంపు ముప్పు తప్పదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యనమదుర్రు డ్రెయిన్‌కు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేయగా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అనేకచోట్ల యనమదుర్రు డ్రెయిన్ గట్టు బలహీనంగా ఉండడంతో పట్టణంలోని మెంటేవారితోట, దుర్గాపురం, పెదపేట తదితర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నక్కల డ్రెయిన్ పొంగడంతో ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలకు ముంపు ముప్పు పొంచి ఉన్నట్లు చెబుతున్నారు.

నందమూరులోకి ఎర్రకాలువ నీరు

తాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు గ్రామంలోకి ఎర్ర కాలువ నీరు ప్రవేశించింది. దీంతో ప్రజలు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మాధవరం-కంసాలిపాలెం కాజ్‌వేకు వెళ్ళే రహదారిపై నుంచి ఎర్రకాలువ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో స్థానిక మహిళలు వరద నీటిలో పసుపు, కుంకుమలు వదిలి వరద శాంతించాలంటూ ప్రార్థించారు. ఎర్రకాలువ వరద నీటిని వీక్షించేందుకు నందమూరు అక్విడెక్ట్, మాధవరం - కంసాలిపాలెం, అప్పారావుపేట-కోరుమామిడి రహదారిపైకి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జగన్నాథపురం గ్రామంలోని పునరావాస కేంద్రంలో 55 మంది నిరాశ్రయులకు భోజన ఏర్పాట్లు చేశారు.

ఆందోళనకరంగా వయ్యేరు వరద : తణుకు మండలం దువ్వ గ్రామంలో వయ్యేరు కాలువ ప్రమాదకరంగా మారింది. దువ్వ అక్విడెక్ట్ వద్ద వరద నీటి మట్టం శుక్రవారం సాయంత్రం 12 అడుగులు ఉండగా శనివారం ఉదయానికి 14 అడుగులకు చేరి అక్విడెక్ట్ అంచులను తాకుతూ వరద ప్రవహిస్తోంది. దీంతోన వయ్యేరు గట్టున గుడిసెలు పూర్తిగా నీట మునిగాయి. ఇక్కడ మరో 2 అడుగులు పెరిగితే వయ్యేరుకు ఎగువన ఉండ్రాజవరం మండల గ్రామాలైన సూర్యారావుపాలెం, కాల్దరి గ్రామాల పరిధిలోని ఎర్రకాలువ గట్టు బలహీనంగా ఉన్న చోట గట్లపై నుంచి వరద నీరు పంట పొలాలల్లో చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. వయ్యేరులో వరద ఉధృతి కారణంగా దువ్వ గ్రామంలోని పలు వీధులలో వరద చేరింది. గ్రామంలోని వీధుల నుంచి వయ్యేరులోకి వున్న ఇన్‌లెట్, అవుట్‌ల ద్వారా గ్రామంలోని వరద నీరు రాకుండా పటిష్టంగా చర్యలు చేపట్టినా వాటి ద్వారా నీరు వీధుల్లోకి చేరింది. దువ్వ వయ్యేరు అక్విడెక్ట్ వద్ద రోడ్డు కొంతమేర కోతకు గురికావడంతో ఇరిగేషన్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

భయం గుప్పిట్లో యండగండి



యండగండిలో ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

యనమదుర్రు డ్రెయిన్, ఉండి పంట కాలువ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. యండగండి వంతెన బ్యాక్‌వాటర్ డ్యాం వద్ద ఇళ్ళల్లోకి నీరు చేరుకోవడంతో ఇసుక బస్తాలు వేశారు. వంతెన సమీపంలోని ఇళ్ళల్లోకి ఉండి కాలువ నీరు చేరుకోవడంతో అక్కడ కూడా ఇసుక బస్తాలు అడ్డుకట్టగా వేశారు. ఉండి పంట కాలువకు ఆనుకుని వున్న జగనన్న కాలనీలోకి నీరు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రాంతాన్ని తహసీల్దార్ కే శ్రీనివాస్ పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. యనమదుర్రు, ఉండి పంట కాలువ గట్లను పరిశీలించారు. పై నుంచి వరదనీరు ఉధృతంగా ఉండి కాలువ, యనమదుర్రు డ్రెయిన్లలోకి ప్రవహిస్తుండటంతో గట్లు తెగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. యండగండి, ఎస్.కొండేపాడు కాజ్‌వే యనమదుర్రు ఉధృతికి పూర్తిగా మునిగిపోయింది. దీంతో ఇరుగ్రామాలతో పాటు పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ముంపు ప్రాంతాల పరిశీలన



భీమవరంలోని దుర్గాపురం, లంకపేట ప్రాంతాలను పరిశీలిస్తున్న జేసి ప్రవీణ్ ఆదిత్య

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో ముంపునకు గురైన దుర్గాపురం, లంకపేట, చేపల మార్కెట్ ప్రాంతాలను, యనమదుర్రు డ్రెయిన్‌ను జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య శనివారం పరిశీలించారు. ముంపు నీరు వేగంగా బయటకు పంపించడం, యనమదుర్రు డ్రెయిన్ ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలన చేసి గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

తీరంలో అలజడి



పేరుపాలెంలో ఎగిసి పడుతున్న అలలు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో పేరుపాలెం బీచ్‌లో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సముద్రంలో వేటకు వెళ్ళే మత్స్యకారులు ఆదివారం వరకు వేటకు వెళ్ళరాదని హెచ్చరికలు జారీ చేసినట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. వాయుగుండం తీరం దాటిన తరువాత వాతావరణ శాఖ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వేటకు వెళ్ళవద్దన్నారు.



భీమవరంలో ముంపునీటిని తోడుతున్న దృశ్యం



నందమూరు గ్రామంలోకి ప్రవేశించిన ఎర్ర కాలువ వరద



తణుకు మండలం దువ్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు



భీమవరంలో నీట మునిగిన బస్టాండు



దువ్వ గ్రామంలో వీధుల్లోకి చేరిన వరద నీరు

వశిష్టకు వరద ముప్పు

- లంక గ్రామాలకు పొంచి ఉన్న ముంపు బెడద
- ఆందోళనకరంగా ఏటిగట్టు, ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లు
- 2022 వరదల్లో ప్రజలకు అండగా నిలిచిన నాటి ప్రభుత్వం
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సహాయక చర్యలు

సాక్షి, భీమవరం: వశిష్ట గోదావరికి వరద తాకిడి మొదలైంది. నిన్నమొన్నటి వరకు నది మధ్యలో కనిపించిన ఇసుక దిబ్బలను ఎగువ ప్రాంతాల నుంచి ఉరకలేస్తూ వస్తున్న ఎర్ర నీరు ముంచెత్తింది. వరద ఉధృతి పెరుగుతుండటంతో పరివాహక లంక గ్రామాల్లో అలజడి మొదలైంది. పలుచోట్ల ఏటిగట్టు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు బలహీనంగా ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది.

యలమంచిలి మండలానికి ముంపు భయం

వరద తీవ్రతను బట్టి యలమంచిలి మండలంలో ఏటిగట్టుకు దిగువన ఉన్న దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాలకు ముంపు బెడద ఎక్కువ. ఆయా గ్రామాల్లో పది వేల వరకు జనాభా ఉంది. కంచుస్తంభంపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాల్లో ఏటిగట్టు దిగువన ఉన్న కొన్ని ఇళ్లు ముంపునకు గురవుతుంటాయి. కనకాయలంక కాజ్‌వే పూర్తిగా నీటి మునిగి రాకపోకలు స్తంభించిపోతాయి. దొడ్డిపట్ల, వాకలగరువు వద్ద ఏటిగట్టు ఏడు వందల మీటర్ల మేర పల్లంగా ఉండి బలహీనపడింది. గోదావరిలో నీరు పెరిగితే ఇక్కడ ఏటిగట్టుకు సమాంతరంగా వరదనీరు ప్రవహిస్తుంది. 2022 జూలైలో ఇక్కడ ఏటిగట్టును తాకుతూ వరద నీరు రావడంతో హుటాహుటిన ఏటిగట్టు మొత్తం గ్రావెల్, మట్టితో మూడు అడుగుల మేర ఎత్తు చేశారు. ఆ మట్టిపై మళ్లీ ఇసుక బస్తాలతో నెట్టు కట్టారు. దీంతో ఆ సమయంలో పెను ప్రమాదం తప్పింది. మళ్లీ ఈ ఏడాది అదే స్థాయిలో గోదావరిలో నీటి మట్టం పెరిగితే గండి పడుతుందేమోనన్న ఆందోళనలో స్థానికులు ఉన్నారు. ఇక్కడ గట్టు జారితే పాలకొల్లు పట్టణంతో పాటు యలమంచిలి, పోడూరు, పాలకొల్లు మండలంలోని పలు గ్రామాలు నీట మునిగే ప్రమాదముంది.

నరసాపురం పట్టణంలో.. నరసాపురం టౌన్‌లోని పొన్నపల్లి, మాధవాయపాలెం, నందమూరు కాలనీ, రూరల్ పరిధిలో కొత్త నవరసపురం, పాత నవరసపురం, బియ్యపుతిప్ప, దర్బరేవులకు వరద ముంపు బెడద ఉంది. పొన్నపల్లి ప్రాంతంలో గోదావరి వంపు తిరిగి ఉండటం వలన నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉండి గట్టు దెబ్బతింటోంది. సుమారు రూ.30 కోట్లు వ్యయంతో రెండేళ్ల క్రితం గట్టు పటిష్ట పనులు చేపట్టారు.

ఆచంట మండలంలో..

ఆచంట మండలంలోని అయోధ్యలంక, పెదమల్లంలంక, పుచ్చలంక, అనగారిలంక, పల్లిపాలెం గ్రామాలు వరద ముంపునకు గురవుతుంటాయి. ఆయా గ్రామాల్లో సుమారు ఎనిమిది వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. వరద తీవ్రతను బట్టి ఈ లంక గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతాయి. వరద ప్రభావిత గ్రామాల్లో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుంది.

మొదలుకాని పనులు

జిల్లాలో నక్కల డ్రెయిన్, కాజా, మాధవాయిపాలెం, దర్బరేవు, ఈస్ట్‌పాక్కిలేరు మేజర్ ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లు, ఏడు మైనర్ స్లూయిజ్‌లు ఉన్నాయి. పలుచోట్ల ఇవి మరమ్మతులకు గురయ్యాయి. కాజా, ఈస్ట్‌పాక్కిలేరు స్లూయిజ్‌ల పునర్ నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరుచేసినా పనులు చేసేందుకు ఎవరు ముందుకు రాక మొదలుకాలేదు.



సిద్ధాంతం మధ్యస్థ లంక నుంచి పంటలను కేదారీఘాట్‌కు పడవల్లో తెస్తున్న రైతన్నలు



నరసాపురంలోని పొన్నపల్లి వద్ద ఏటిగట్టును పరిశీలిస్తున్న అధికారులు

నాడు అండగా నిలిచిన జగన్ ప్రభుత్వం

2022 జూలైలో వరదలు వచ్చిన సమయంలో నాటి వైఎస్సార్ ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచింది. ధవళేశ్వరం నుంచి 26 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల కావడంతో జిల్లాలోని 33 లంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అవసరమైన సేవలందించారు. 33 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 12 రోజుల పాటు 11,866 మంది వరద బాధితులకు భోజన వసతి కల్పించారు. వందల మంది పోలీసులు, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, వలంటీర్లు ఎక్కడికక్కడ సమర్థవంతంగా సేవలందించారు. వరద ప్రభావిత 10,438 కుటుంబాలకు రూ. రెండు వేలు చొప్పున ప్రభుత్వం తక్షణ సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. 8,336 పశువులకు 425 టన్నుల దాణా అందించారు.

జాతీయ రహదారి వెంట కచ్చా డ్రెయిన్



కచ్చా డ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం

సాక్షి స్పందన

ఆకివీడు: జాతీయ రహదారుల శాఖ, ఆకివీడు అధికారులు ఎట్టకేలకు స్పందించారు. జాతీయ రహదారి ప్రాంతంలో కచ్చా డ్రెయిన్ తవ్వేందుకు చర్యలు చేపట్టారు. భారీ వర్షాలతో పాటు, సమీపంలోని రెస్టారెంట్, అపార్టుమెంట్‌లకు చెందిన మురుగు నీరు జాతీయ రహదారిపైకి రావడంతో వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో 'ప్రమాదం జరిగితేనే గాని పట్టించుకోరా?'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్, అధికారులు స్పందించారు. కచ్చా డ్రెయిన్ తవ్వేందుకు జేసీబీని, మట్టిని తొలగించేందుకు లారీని ఎన్‌హెచ్ అధికారులు సమకూర్చగా, స్థానిక సిబ్బంది పనులు పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు


శ్రీనివాసరావు మృతదేహం

కామవరపుకోట: చెడు వ్యసనాలకు బానిసై ఆస్తి తన పేరున రాయలేదనే కక్షతో మద్యం మత్తులో కన్న తండ్రిపై దాడి చేసి హతమార్చాడో కొడుకు. వివరాల్లోకి వెళితే.. తడికలపూడి గ్రామనికి చెందిన నాగబోయిన శ్రీనివాసరావు (50) భార్య గతంలో చనిపోవడంతో కుమారుడు కార్తీక్‌తో కలిసి గ్రామ శివారు వేంపాడు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. కార్తీక్ మద్యానికి బానిసై నిత్యం డబ్బు ఇవ్వాలని తండ్రిని వేధించేవాడు. తండ్రి పేరును ఉన్న రెండున్నర ఎకరాల భూమిని తన పేరును రాయాలని అనేక సార్లు తండ్రితో గొడవ పడి ఒత్తిడి చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కార్తీక్ పూటుగా మద్యం తాగి వచ్చి ఆస్తి తన పేరున రాయాలని తండ్రి శ్రీనివాసరావుతో గొడవపడ్డాడు. అందుకు తండ్రి నిరాకరించడంతో కార్తీక్ మద్యం మత్తులో తండ్రి శ్రీనివాసరావుపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తడికలపూడి ఎస్సై జయబాబు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు కార్తీక్‌ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరావు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బకాయి బిల్లులు చెల్లించాలంటూ వినతి


డీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచ్‌ల హక్కులు, విధులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన డీపీఓ కార్యాలయ పౌరసమాచార అధికారి ఎంవీ కిషోర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ముప్పవరం పంచాయతీలో హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మాణానికి రూ.8లక్షలు ఖర్చు పెట్టినా నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదని ఆరోపించారు. అలాగే పంచాయతీ పరిధిలో వీధి దీపాలు, డ్రెయిన్లు, రోడ్లు తదితర పనులకు సంబంధించి రెండు నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించలేదన్నారు. పంచాయతీలో చేసిన పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాలంటూ విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఎప్పుడో?

- జగన్ ప్రభుత్వంలో ఏటా జూన్‌లోపే కాంట్రాక్ట్ పునరుద్ధరణ
- రెగ్యులరైజేషన్ కోసం జీఓ ఇచ్చినా కోడ్‌తో నిలిచిన అమలు
- పీఆర్‌సీ కూడా వర్తింపచేయడంతో భారీగా పెరిగిన జీతాలు
- కొత్త ప్రభుత్వంలో కాంట్రాక్ట్ పునరుద్ధరణపై కానరాని చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 39 కళాశాలల్లో 270 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు


ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విభాగం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఒప్పంద గడువును కొత్త విద్యా సంవత్సరానికి పునరుద్ధరించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. గత జగన్ సర్కారు అప్పటివరకు ఉన్న తొమ్మిది నెలల కాలపరిమితిని ఏడాదికి పొడిగించడంతో పాటు పీఆర్‌సీ వర్తింపజేయడంతో ఒక్కసారిగా రూ.20వేలకు పైగా వారి జీతాలు పెరిగాయి. అదేవిధంగా కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు జీవో విడుదల చేశారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా అది అమలు కాలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో తమ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తుందా లేక మరో నిర్ణయమేదైనా తీసుకుంటుందా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇంటర్మీడియట్ విద్యలో కాంట్రాక్ట్ లెక్చరర్ల పాత్ర అత్యంత కీలకం. సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టులు బోధించే లెక్చరర్లు అధిక శాతం మంది కాంట్రాక్ట్ అధ్యాపకులే. గతంలో వీరికి జీతాలు కూడా నామమాత్రంగానే ఉండేవి. 2019లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకుల కష్టాలను తెలుసుకుని వారికి పీఆర్‌సీ వర్తింపజేయడంతో అప్పటివరకు రూ.37,100గా ఉన్న వీరి జీతాలు ఒక్కసారిగా రూ.57,100కు పెరిగాయి.

ఏటా జూన్ ఒకటో తేదీలోపే జీవో

దాదాపు 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులకు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది. 2019కి ముందు కాంట్రాక్ట్ అధ్యాపకులకు విద్యాసంవత్సరంలో 6 నుంచి 9 నెలలకు మాత్రమే కాంట్రాక్ట్ లభించేది. అంటే ఏడాదంతా పనిచేసినా వారికి జీతాలు మాత్రం కేవలం 6 నుంచి 9 నెలలకు పరిమితమయ్యేది. కొన్ని సార్లు విద్యా సంవత్సరం ముగిసిన అనంతరం కూడా వీరితో చాకిరీ చేయించుకుని ఎటువంటి జీతాలూ చెల్లించేవారు కాదు. అటువంటి పరిస్థితిలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో వీరికి విద్యా సంవత్సరం వరకు మాత్రమే కాక ఏడాది మొత్తం అంటే 12 నెలలూ కాంట్రాక్ట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. 2019 నుంచి ఏటా క్రమం తప్పకుండా జూన్ ఒకటో తేదీ లోపే అధ్యాపకుల కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో అప్పటివరకు కొన్ని నెలలు జీతాలు రాక సమస్యలు ఎదుర్కొన్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు వైఎస్ జగన్ తీసుకున్న చర్యతో సంతృప్తిని మిగిల్చింది.

రెండు నెలలుగా అందని జీతాలు

కాంట్రాక్ట్ అధ్యాపకులు విద్యా సంవత్సరం ముగిసిన తరువాత కూడా ఖాళీగా లేకుండా విధులు నిర్వహించారు. గత మే నెలలో ఎన్నికల విధుల్లో పాలుపంచుకున్నారు. తరువాత సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం సప్లిమెంటరీ పరీక్షల విధులు, వెంటనే ఆన్‌లైన్ మూల్యాంకనం విధులకు కూడా హాజరయ్యారు. దీంతో పాటు 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్‌ను కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టారు. జూన్ ఒకటో తేదీ నుంచే కళాశాలల్లో బోధనకు సిద్ధమయ్యారు. అయినా మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు ఇప్పటికీ అందకపోవడం గమనార్హం. వీరి కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తే తప్ప వీరికి ఆయా పెండింగ్ నెలల జీతాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

సింహభాగం కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లదే

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 39 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో సుమారు 90 మంది ప్రభుత్వ లెక్చరర్లు, 160 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 80 మంది ప్రభుత్వ లెక్చరర్లు, సుమారు 110 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు ఈ రెండు జిల్లాల్లో సుమారు 1300 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. అంటే ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధన తరగతులు నిర్వహించడంలో సింహభాగం కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లే తీసుకుంటున్నారు.

114 జీఓను అమలు చేయాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం 2023 అక్టోబర్ 23న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ 114 జీఓను విడుదల చేసింది. ఎన్నికల కోడ్ వల్ల జీఓ అమలు కాలేదు. కొత్త ప్రభుత్వం జీఓను అమలు చేసి కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి. దీంతో పాటు కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– బీజే గాంధీ, ప్రైవేట్ లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వెంటనే జీతాలు చెల్లించాలి



మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు విడుదల కాక కాంట్రాక్ట్ లెక్చరర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారి ఈఎంఐలు చెల్లించలేక పెనాల్టీలు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్ల దుర్భర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలి.

– గోపే శ్యామ్‌కుమార్, ఉమ్మడి జిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్ల యూనియన్ అధ్యక్షుడు

విద్యుత్ తీగ తెగిపడి పారిశుధ్య కార్మికుడి మృతి


చిటికెల శ్రీను మృతదేహం

తణుకు: విద్యుత్ తీగ తెగి మీద పడటంతో చెత్తను సేకరిస్తున్న ఓ పారిశుధ్య కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తణుకుకు చెందిన చిటికెల శ్రీను (42) మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం పైడిపర్రు శ్మశానవాటిక వద్ద చెత్తను సేకరిస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగి అతనిపై పడింది. దీంతో షాక్ గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి ప్రథమ చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడు శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రూ.25 లక్షలు ఇవ్వాలి

పారిశుధ్య కార్మికుడు చిటికెల శ్రీను కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరుతూ శనివారం తణుకు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కార్మిక సంఘాలు ఆందోళన నిర్వహించి మునిసిపల్ కమిషనర్ బీవీ రమణకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధనాల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంపై వర్షం ప్రభావం

ద్వారకాతిరుమల: వర్షం కారణంగా చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా తగ్గింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి శనివారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శిస్తుంటారు. అయితే ఈ వారం కుండపోత వర్షం కారణంగా ఆలయానికి భక్తులు నామమాత్రంగా విచ్చేశారు. దీంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, నిత్యాన్నదాన భవనం, కేశఖండనశాల ఇలా అన్ని విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం కొత్తపాలెంలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం పెయ్యూరు గ్రామానికి చెందిన గురజాడ రమేష్ (35) 15 ఏళ్ల క్రితం మొగల్తూరు మండలం కొత్తపాలెంకు చెందిన యువతిని వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. అతని భార్య కువైట్‌లో ఉంటుండగా వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజామున రమేష్ నివాసం ఉంటున్న ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థికపరమైన కారణాలే ఆత్మహత్యకు కారణమని బంధువులు చెబుతున్నారు. బావమరిది వర్ధనపు చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోన్‌కు లింక్ పంపి రూ.6 లక్షల కాజేత

పాలకోడేరు: ఫోన్‌కు వచ్చిన ఓ లింక్‌ను ఓపెన్ చేయడంతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి రూ.6 లక్షల సొమ్ము అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గరగపర్రుకు చెందిన కశ్య వరాహావతారం వ్యవసాయం చేసుకుని జీవిస్తుంటాడు. వ్యక్తిగత అవసరాల కోసం పొలం అమ్మగా వచ్చిన రూ.8 లక్షల సొమ్మును యూనియన్ బ్యాంక్ ఖాతాలో వేశాడు. ఇదిలా ఉండగా, శుక్రవారం యూనియన్ బ్యాంక్ వారు పంపినట్లుగా 98454 68139 నంబర్ నుంచి అతని ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చెయ్యగా దఫాదఫాలుగా రూ.6 లక్షలు అతని బ్యాంక్ ఖాతా నుంచి విత్‌డ్రా అయ్యాయి. బాధితుడు శనివారం పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం

భీమవరం: గల్ఫ్ పంపిస్తానని డబ్బు తీసుకుని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు టుటౌన్ హెచ్‌సీ భూషణం చెప్పారు. భీమవరానికి చెందిన సంగాని ఏసుపాదంను గల్ఫ్ పంపిస్తానని ఆకివీడుకు చెందిన కారాడి దుర్గారావు దఫదఫాలుగా రూ.1.70 లక్షలు తీసుకున్నాడు. ఇప్పటికీ గల్ఫ్ పంపించలేదని ఏసుపాదం భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భూషణం శనివారం చెప్పారు.

క్లుప్తంగా

మిద్దె తోటల పెంపకంపై అవగాహన



మిద్దెతోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తణుకు: తాడేపల్లిగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం తణుకులో మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరటి తోటలతో పాటు పుట్టగొడుగుల పెంపకం చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పుట్టగొడుగుల పెంపకంతో పాటు రెడీ టు ఫ్రూట్ మష్రూమ్ బ్యాగ్స్ ఏర్పాటు చేసుకునే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మిద్దెతోటల పెంపకందారులు ముళ్లపూడి ప్రసన్నలక్ష్మి, శివరామకృష్ణ ప్రసాద్, సరోజలు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

పెంటపాడు: కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు తెలిపారు. పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేసారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తోట రాజేష్, వి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నేడు అఘోరీలకు గురుపూజ

తణుకు అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా అఖిల భారతీయ అఘోర్ అఖాడ ఆధ్వర్యంలో ఆదివారం తణుకు కమ్మ కల్యాణ మండపంలో గురువులకు ప్రత్యేక గురుపూజోత్సవ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ మహోత్సవంలో ఉజ్జయినీ, మధ్యప్రదేశ్‌కి చెందిన అఖిల భారతీయ అఘోర్ అఖాడ అధ్యక్షులు, అఘోరేశ్వర్ భగవాన్ డాక్టర్ ఆదేష్ నాథ్‌జీ అఘోరీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్ నాథ్‌జీ అఘోరీ గురుదేవులకు గురుపూజ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మదనగోపాలస్వామి ఆలయానికి గోదానం



బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయానికి గోదానం చేస్తున్న దాత కుటుంబం

అత్తిలి: మండలంలోని బల్లిపాడు మదనగోపాలస్వామి దేవస్థానానికి గ్రామానికి చెందిన భక్తుడు కుటుంబ సభ్యులు గోదానం చేశారు. మేళతాళాలతో గోమాతను శుక్రవారం ఊరేగించి ఆలయ అధికారులకు బహూకరించారు. ఈసందర్భంగా గోపూజ చేసారు. విత్తంశెట్టి వెంకట సత్యనారాయణ, శ్రీదేవి, నాగ వెంకట సత్యప్రకాష్; గీతాశ్రీ నాగ వెంకట్, చైతన్య జ్ఞాన శ్రీసాత్విక్, వీక్షా శ్రీసాయి నాగమణి, శ్రీనివాస సుబ్రహ్మణ్యం, హరిణి, శ్రీనివాస్ సీతారాం, వెంకటలక్ష్మి, రాధా ఆర్థిక సహాయంతో గోవును ఈవో హరి గోపీనాథ్‌కు గోమాతను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గోసరంక్షణ నిమిత్తం విత్తంశెట్టి సత్తిబాబు రూ. 15వేల చెక్కును అందజేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశం

పెంటపాడు: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని జట్లపాలెం గ్రామ సర్పంచ్ ఖండవల్లి మణిరాజు పేర్కొన్నారు. గ్రామంలోని ఎంపీయుపీ పాఠశాలలో గ్రామానికి చెందిన దాత గొర్రిపాటి ప్రసాద్ సాయంతో రూ. 40 వేల విలువైన స్కూల్‌లో 150మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పైడారావు, ఎంఈఓ టీవీ రామకృష్ణ, ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ రమణారావు, కుదళ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్, బాలాజీ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే ధ్యేయం

పెంటపాడు: రానున్నరోజుల్లో బీజేపీ బలోపేతమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతాజీ, బీజేపీ గూడెం కన్వీనర్ ఈతకోట తాతాజీ పిలుపునిచ్చారు. బీజేపీ మండల శాఖ సమావేశం శనివారం అలంపురంలో టీబీఆర్ సైనికస్కూల్ వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దత్తుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి వెంకటరెడ్డి, నరిశే సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పంటలన్నీ..

- దంచికొడుతున్న వానలు
- మరోవ్రక్క పొంగుతున్న వాగులు
- పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు
- స్తంభించిన జనజీవనం



దువ్వలో నీట మునిగిన వరి చేలు



అత్తిలి మండలం వరిఘేడు శివారు ఎర్రనీలిగుంటలో ముంపులో వరినాట్లు

తణుకు: తణుకు నియోజకవర్గాన్ని వరుణుడు ముంచెత్తుతున్నాడు. ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. ఆకాశానికి చిల్లు పడిందా? అన్నట్లుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. తణుకులో గురువారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 171.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాలు కారణంగా పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పంటలు నీట మునిగాయి. వరి చేలు సైతం చెరువులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి వరిచేలు నీటిలో మునిగి ఉండటంతో నాట్లు కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరిపైరు నీటిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పంట నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని, చేలల్లోని నీరు తగ్గితేగానీ వాస్తవ నష్టం తెలియదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వయ్యేరుకు పోటెత్తుతున్న వరద...

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, ఉపనదుల నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో వెంకయ్య వయ్యేరుకు వరద పోటెత్తుతోంది. ఎర్ర కాలువ నుంచి నేరుగా తణుకు మండలం దువ్వ వెంకయ్య వయ్యేరుకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో దువ్వ అక్విడెక్టు వద్ద ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఎగువ నుంచి మరింతగా వరద నీరు వస్తుండటంతో అక్విడెక్టు గేట్లు పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. శనివారం సాయంత్రం నాటికి 16 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ఈ క్రమంలో అక్విడెక్టుపై రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు సైతం అక్కడే ఉండి నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పెంటపాడు: విడవకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎగువ నుంచి వర్షపు నీరు రావడంతో యనమదుర్రు డ్రెయిన్ ఉప్పొంగుతోంది. కొండేపాడు, మీనవల్లూరు వంతెనల అంచులు తాకుతూ వరవల్ల తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. ప్రజాప్రతినిధులతో పాటు, జిల్లా కలెక్టర్ వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కాగా స్థానికంగా కాలువ పరివాహన ప్రాంతాల్లో రెండు



యనమదుర్రు ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు



ఇరగవరంలో భారీ వర్షాలకు నీటిలో మునిగిన వరి చేలు



అత్తిలి మండల పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్

వైపులా బలహీనంగా ఉన్న గట్లు పటిష్టం చేసేందుకు స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ, మండల అధికారుల చర్యలు శూన్యం. ప్రతీ ఏటా ఈ డ్రెయిన్ పొంగుతున్న సమయంలో అధికారులు అప్రమత్తమయ్యేవారు. కాగా ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన రెవెన్యూ, మండల సిబ్బందికి డ్రెయిన్ ఉధృతి తెలియడం లేదు. దీంతో వారు సహాయకచర్యల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వరద ముంపు పరిస్థితిని గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు పరిశీలించి అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు.

ఆగని వాన

ఇరగవరం: వర్షం ఎక్కడా ఆగడం లేదు. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా పడుతూనే ఉంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం శనివారం కూడా కొనసాగింది. విరామం లేకుండా పడుతున్న వాన కారణంగా ఎక్కడికక్కడే ముంపు నీరు చేరిపోయింది. పల్లపు ప్రాంతాలను చుట్టిముట్టేసింది. ముంపు నీటిని బయటకు పంపేందుకు వివిధ శాఖల సిబ్బంది చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వీడకుండా వర్షం పడుతుండడంతో ముంపునీరు తగ్గడం లేదు. ఇరగవరం మండలంలోని 20 గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. దీంతో అర్జునుడు పాలెం, ఇరగవరం, కంతేరు, కత్తవపాడు, కె ఇల్లిందలపర్రు, కావాలిపరం, రేలంగి, శివారు ప్రాంతాలు కేతావారి పాలెం, వేండ్రవారిపాలెం, బొబ్బారాజుపాలెం, అనుమాజిపాలెం, గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. పంట పొలాలు గత మూడు రోజులు నుంచి నీటిలోనే ఉండటంతో నారు చచ్చిపోయి మళ్లీ నాట్లు వేసుకోవలసిన పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకర స్థాయిలో యనమదుర్రు డ్రెయిన్

అత్తిలి: అధిక వర్షాలు కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అత్తిలి మండలంలో గల రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు మేజర్ డ్రెయిన్‌లు పొంగి ప్రవహించడంతో వరినాట్లు నీట మునగాయి. యనమదుర్రు డ్రెయిన్ గట్లను అంచును తాకుతా ప్రవహించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగం యనమదుర్రు డ్రెయిన్‌గట్టు వెంబడి పహారా కాస్తూ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక బస్తాలతో పటిష్టం చేస్తున్నారు. ఎగువ ప్రాంతంనుంచి శనివారం భారీగా వరదనీరు రావడంతో యనమదుర్రు డ్రెయిన్ ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుంది. ప్రతీ ఏడాది సార్వాసీజన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు యనమదుర్రు డ్రెయిన్‌లోకి వచ్చి చేరడంతో పంటచేలు ముంపు బారిన పడి రైతులకు తీవ్రనష్టాన్ని మిగులుస్తుంది. వర్షాలు మరికొన్ని రోజులు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో పంట చేలు ముంపు నుంచి ఇప్పుడు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. యనమదుర్రు డ్రెయిన్‌లో వరదనీరు తగ్గితేనే ఆరుదలకోడు, ఈర్లకోడు, రాచకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు తెరుస్తారు. అప్పటి వరకు వరిపంట నీట ముంపులో ఉండటం వల్ల పంట కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాదిరూపాయాలు పెట్టుబడులు పెట్టామని, ప్రతి ఏడాది సార్వాసాగులో తమకు పంటనష్టాలు తప్పడంలేదని వాపోయారు. అధికారులు. ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పంట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

కార్యకర్తలకు మాజీ మంత్రి 'కొట్టు' పరామర్శ



తాడేపల్లిగూడెం ఒకటవ వార్డులో అరిగెల ప్రసాద్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం పరామర్శించారు. పట్టణంలోని 1వ వార్డుకు చెందిన అరిగెల ప్రసాద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమితో హైబీపీతో మంచం పట్టారు. దీంతో ఆయనను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, ఉప్పరగూడెం గ్రామ మాజీ సర్పంచ్ దాకే పండియ్య, అప్పారావుపేటలో నారపురెడ్డి సూర్యనారాయణ, పట్టెంపాలెంలో జంపెల్ల సత్యవతి, వీరంపాలెంలో రెడ్డి సురేష్‌రెడ్డిలతో పాటు ఇటీవల మృతి చెందిన మానుకొండ రామకృష్ణ కుటుంబాన్ని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, నిమ్మల నాని, బందారు నాగు, ముప్పిడి వెంకట్రామిరెడ్డి, వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, కార్యకర్తలు ఉన్నారు.

ముంపుచేలను పరిశీలించిన అధికారులు



ఇరగవరంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

ఇరగవరం: మండలంలోని ఇరగవరం, అర్జునుడు పాలెం, కావలిపురం,గోటేరు, కె ఇల్లిందలపర్రు, రేలంగి గ్రామాలను మండల వ్యవసాయశాఖ అధికారి వై రాఘవేంద్రరావు శనివారం సందర్శించారు. దీనిలో భాగంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంటలను సందర్శించారు. ముంపులో ఉన్న చేలలో నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- హెల్మెట్‌దారణ కోసం నడుంకట్టిన న్యాయమూర్తులు
- న్యాయవ్యవస్థ, పోలీసు యంత్రాంగం కృషి
- తణుకులో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు



తణుకులో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు, సీఐలు(ఫైల్)

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో మానవ తప్పిదాల వలనే నిండు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ప్రతిరోజూ చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తమ ప్రయాణాల్లో హెల్మెట్ ధరించక పోవడంతో రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలై అసువులు బాస్తున్నారు. దీంతో గతం నుంచి పోలీసు యంత్రాంగం ప్రతిరోజూ హెల్మెట్ పెట్టుకోవాలంటూ స్పెషల్ డ్రైవ్‌లతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది. కానీ ప్రయాణికుల్లో మాత్రం పూర్తి స్థాయిలో ఆచరణలోకి రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇప్పటి వరకు పోలీసు యంత్రాంగానికి ఆదేశాలిచ్చిన న్యాయస్థానాలు ఇప్పుడు ఏకంగా న్యాయమూర్తులను సైతం నేరుగా రోడ్డుమీదకు పంపించి హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో పలు అవగాహన కార్యక్రమాలు, హెల్మెట్‌దారణతో బైక్ ర్యాలీలను నిర్వహిస్తున్నారు. కోర్టు హాల్‌లో కేసులు పరిష్కరించే న్యాయమూర్తులు రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించే క్రమంలో వాహనదారుల్లో హెల్మెట్‌పై అవగాహన కల్పించేందుకు నడుంకట్టారు. తాజాగా హైకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి సూచనలతో తణుకు కోర్టు న్యాయమూర్తులు స్వయంగా ఈనెల 18వ తేదీన తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ చేపట్టారు. ఈనెల 9న మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులతో ట్రాఫిక్ పోలీసు విభాగం కూడా పలు సెంటర్‌ల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.

తలకు గాయాలతోనే ప్రాణాలు పోతున్న వైనం...

నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పరిస్థితుల్లో హెల్మెట్ పెట్టుకున్న వాహనదారులు బతికిబయట పడుతుండగా, హెల్మెట్ ధరించని వారు అసువులు బాస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో అధికశాతం తలకు గాయాలై చనిపోతుండగా, పట్టణ పరిధిలోని ప్రధాన రహదారుల్లో సైతం డివైడర్‌లను ఢీకొట్టిన ప్రమాదాల్లో తలకు గాయాలై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో పోలీసుల అధికారులు ద్విచక్ర వాహనం ఎక్కితే హెల్మెట్ ధరించాల్సిందే అనే నినాదాన్ని తీసుకువచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించిన సందర్భాల్లో ఆ కుటుంబం రోడ్డున పడిపోయి ఆపన్నుల కోసం అర్రులు చాచే దుస్థితి కలుగుతుంది. ట్రాఫిక్ పోలీసులు నిత్యం మీ కోసం కాదు మీమీద ఆధారపడ్డ మీ భార్య, పిల్లల కోసం హెల్మెట్ ధరించడంటూ వాహనదారులను బతిమలాడుతున్నారు.

న్యాయమూర్తులు కదలివచ్చారు



రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం తలకుగాయాలై వాహనదారులు మృతి చెందుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు, న్యాయస్థానాల ఆదేశాల మేరకు చాలా ఏళ్లగా నిత్యం హెల్మెట్ ధరించడంటూ ట్రాఫిక్ పోలీసు విభాగం ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నాం. కానీ ఫలితం ఆశించిన మేర రాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తాజాగా న్యాయస్థానం ఆదేశాల మేరకు న్యాయమూర్తులు కూడా హెల్మెట్ ధరించండి మీ ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో రోడ్డుపైకి వచ్చి అవగాహన కల్పించడం మంచి పరిణామం.

– ఎం.నాగరాజు, తణుకు పట్టణ సర్కిల్ ఇనస్పెక్టర్

మానవ తప్పిదాలతోనే



రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మానవ తప్పిదాల కారణంగానే జరుగుతున్నాయి. లక్షలు ఖర్చుపెట్టి కొత్త వాహనం కొంటున్నారు కానీ ఒక హెల్మెట్ కొనుగోలు చేసేందుకు వెనుకాడుతున్నారు. ఒక వేళ హెల్మెట్ కొన్నా పెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారే కానీ తనపై ఆధారపడ్డ కుటుంబ సభ్యుల గురించి కూడా ఆలోచించడంలేదు. ప్రమాదాల్లో అధికశాతం తలకు గాయమై ప్రాణాలు కోల్పోయి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి వస్తుండడం బాధాకరం.

– డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

బీఓబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంక్ ఆఫ్ బరోడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, పీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న హిందూ రుద్ర భూమికి శనివారం రూ.25 వేలు విలువైన రెండు గీజర్లు, మూడు సీలింగ్ ఫ్యాన్లు, పెదతాడేపల్లి బరోడా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో రూ.10 వేలు విలువగల హాట్ అండ్ కూల్ వాటర్ ఫ్రిజ్ అందజేశారు. మేనేజర్లు ఎం.కేదారి, కరుణాకర్, బ్యాంక్ సిబ్బంది, మానవతా తరుపున పచ్చ వెంకటేశ్వరరావు, యర్ర ఆంజనేయస్వామి, రాజేంద్రకుమార్, దువ్వ శ్రీనివాస్, నార్ని త్రిమూర్తులు, చేకూరి బంగ్రారాజు, బురిడి సతీష్, మిరియాల కిషోర్ కుమార్, కురుమేళ్ళ బాలకృష్ణ, తమరాడ చిన్న, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దువ్వ గ్రామంలో వరదల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

తణుకు టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. దువ్వ వయ్యేరు వరద కారణంగా గ్రామంలో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు ఏర్పడకుండా దువ్వ గ్రామంలో మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వరాల గురించి సర్వే నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు కారణంగా తణుకు మండలంలోని వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయి కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారింది. తేతలి, దువ్వ గ్రామాల్లోని వరి పంట పొలాలు వర్షపు నీటిలోనే మునిగి ఉన్నాయి.

ఎర్ర కాలువ ఉధృతిని పరిశీలించిన జేడీ



మాధవరం వద్ద ఎర్ర కాలువ ముంపును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం వద్ద ఎర్ర కాలువ ఉధృతిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు వివరాలను ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్.ప్రసాద్‌లను అడిగి తెలుసుకున్నారు. నీరు తగ్గిన వెంటనే అంచనాలు వేయాలని సూచించారు. అలాగే పెదతాడేపల్లి, చినతాడేపల్లి, కొండ్రుప్రోలు, మాధవరం, మోదుగ గుంట, నందమూరు, నవాబుపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ పర్యటించి, వర్షపు నీటిలో మునిగిన నారుమడులు, నాట్లను పరిశీలించారు. మండలంలో 11,709 ఎకరాల్లో వరి చేలు నీట మునిగిందన్నారు. ఎర్ర కాలువ ఆయకట్టులో 874 ఎకరాలు, పిల్లల కాలువలు పొంగడం వల్ల 3636 ఎకరాల్లో వరి నీట మునిగిందని వివరించారు. మరో ఎనిమిది ఎకరాల్లో వరి నారుమడులు నీట మునిగాయన్నారు. మోదుగ గుంట, మాధవరం సర్పంచ్‌లు జానకీరామయ్య, ముప్పిడి సూర్యకుమారి, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జులు గోవర్ధని, సురేష్, సతీష్, నవీన్, నాయకులు బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యాన కళాశాలలో టు క్రాక్ ఇంటర్వ్యూస్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన కళాశాలలో కెరీర్ డెవలప్మెంట్ సెంటర్ నందు ప్లేస్మెంట్ కో ఆర్డినేషన్ ప్రిపరేషన్ ఫర్ ద ఫ్యూచర్ కంపోనెంట్ క్రింద సెన్సిటైజేషన్ ప్రోగ్రాం అన్ హౌ టు క్రాక్ ఇంటర్వ్యూస్ అనే సెమినార్ల శ్రేణి నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డివిజనల్ అగ్రోనామిస్ట్ మోహన్ కుమార్ చే టిప్స్ టూ క్రాక్ ఫ్రెషర్ ఇంటర్వ్యూ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. అసోసియేట్ ఉపాధ్యక్షుడు, జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్, హైదరాబాద్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎ.ప్రసాద్‌బాబులు మాట్లాడుతూ ఇంటర్వ్యూ రకాలు, మంచి అభిప్రాయాన్ని ఎలా పొందాలనే దానితో పాటు విజయవంతమైన ఇంటర్వ్యూకి ఐదు దశల గురించి వివరించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి.అర్.సలోమి సునీత, డీన్ డాక్టర్ ఎం.మాధవి, బోధనా సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.